క్లుప్తంగా

తెలంగాణలో రిజర్వేషన్‌పై హర్షం



గుంటూరు రూరల్: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను అమలు చేయటం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతి కుమార్ తెలిపారు. సోమవారం నగరంలోని అమరావతిరోడ్డు బీపీ మండల్ విగ్రహం వద్ద బీసీలకు అత్యధిక రిజర్వేషన్‌లను కల్పించినందుకు తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు తదితరులున్నారు.

చలపతి కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: విద్యార్థులు, అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ తిప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డికి బీహార్‌లోని పాట్నాకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. నీటి అడుగున శబ్ద సెన్సార్ నెట్‌వర్క్‌లతో కలిసి స్థితి స్థాపక స్థానీకరణ వ్యూహాలపై చేసిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ పరిశోధనను ప్రొఫెసర్ రాజీవ్‌కుమార్ పర్యవేక్షణలో చేశారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్, డాక్టర్ కేవీ రామారావు అభినందించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: లారీ వెనుక టైర్లకిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం మల్లారెడ్డినగర్‌కు చెందిన యడవల్లి వెంకటరామయ్య (60) మిర్చియార్డులో పని నిమిత్తమై వచ్చాడు. అదే క్రమంలో మిర్చిలోడుతో యార్డులోకి వెళుతున్న మిర్చిలారీ ఒక్కసారిగా దూసుకు రావటంతో లారీ వెనుక టైర్ల కిందపడి మృత్యువాతకు గురయ్యాడు. సంఘటన విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందెల రవమిది అలరిస్తుంది



పెదకాకాని: సంప్రదాయ నృత్య కళలను బ్రతికించుకోవాలని వాటి గురించి ప్రపంచానికి చాటి చెప్పాలన్న ప్రయత్నంతో అందెల రవమిది చిత్రం రూపొందించబడుతుందని ప్రముఖ నృత్య కళాకారిణి, నటి దర్శకురాలు అభినయశ్రీ ఇంద్రాణి దావులూరి అన్నారు. అందెల రవమిది చిత్రం త్వరలో అమెజాన్ ప్రైమ్ వీడియోస్‌లో విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని నంబూరు వీవీఐటీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. నటి, దర్శకురాలు ఇంద్రాణి మాట్లాడుతూ ఈ చిత్రం అన్ని వర్గాల వారిని అలరిస్తుందని, సంప్రదాయ కళలను ఆదరించి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నటి ఇంద్రాణి దావులూరి, వీవీఐటీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైతాంగ కోరికల దినోత్సవం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాక ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏపీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం రైతాంగ కోరికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏపీకేఎస్ జెండాను రైతు సంఘం నాయకులతో కలిసి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఆవిష్కరించి, మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పనిచేస్తూ రైతాంగ సమస్యలను విస్మరించిందని అన్నారు. ఈ నెల 8న అన్ని మండల కేంద్రాల్లో రైతు సంఘాలు, సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నియోజకవర్గ రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు గుంటక సాంబిరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ముసునూరు సుహాస్, కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ మార్కెట్ తరలించేందుకు ప్రయత్నాలు

- పొన్నూరు బైపాస్ వద్ద ఓ కాంప్లెక్స్‌లోకి తరలించేందుకు చర్యలు
- రూ.3 కోట్లకుపైగా పన్ను బకాయిలు ఉన్నట్లు చెబుతున్న అధికారులు
- మార్కెట్ ఏ విధంగా నిర్వహిస్తారో అని ప్రశ్నార్థకంగా మారిన వైనం



కొల్లి శారద మార్కెట్ లోపలికి వెళ్లకుండా బ్యారికేట్స్ పెట్టిన దృశ్యం

నెహ్రూనగర్: ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్ ఉంది. డాక్టర్ కొల్లి శారదా హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్‌ను పొన్నూరు రోడ్డు హైవే బ్రిడ్జి దగ్గర ఉన్న ఓ కాంప్లెక్స్‌లోకి తరలించేందుకు పాత లీజుదారులు సన్నాహాలు మొదలుపెట్టారు. సోమవారం సదరు కాంప్లెక్స్ వద్ద షాపులు ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకున్నారు. సదరు కాంప్లెక్స్‌లోనే లావాదేవీలు జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. అయితే ఇక్కడే ఓ చిక్కుముడి పడింది. సదరు షాపులకు సంబంధించి పన్ను బకాయిలు రూ.3 కోట్ల వరకు ఉన్నాయి. సదరు షాపుల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. రెవెన్యూ అధికారులు బకాయిలు చెల్లించాలని నోటీసులు ఇచ్చేందుకు సన్నద్ధమైనట్లు సమాచారం. మరో పక్క కోర్టులో ఈ విషయం నలుగుతుండటంతో అధికారులు దీనికి కౌంటర్ ఫైల్ కూడా వేశారు. సదరు కాంప్లెక్స్‌కు అనుమతులు పూర్తి స్థాయిలో అనుమతులు ఉన్నాయా.. లేదా అనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

వివాదం ఏమంటే..

డాక్టర్ కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్ విషయంలో పాత లీజుదారులు అసలు తగ్గడం లేదనే చెప్పుకోవాలి. మార్కెట్‌లో ఉన్న షాపులకు 25 ఏళ్ల లీజుగడువు పూర్తయినా షాపులను ఖాళీ చేయకుండా కోర్టుల ద్వారా దాదాపు ఏడాదికి పైగా అక్కడే తిష్ట వేశారు. చివరికి కోర్టు బహిరంగ వేలం పాట పెట్టాలని ఆదేశించడంతో.. ఈ బహిరంగ వేలాన్ని ఎలాగైన ఆపాలని స్థానిక ఎమ్మెల్యేతో మంతనాలు జరిపించి.. మున్సిపల్ శాఖ మంత్రి ద్వారా కమిషనర్‌కు ఫోన్లు చేయించిన విషయం తెలిసిందే.. అయితే కమిషనర్ పులి శ్రీనివాసులు ఈ విషయాన్ని మంత్రికి కూలంకషంగా వివరించడంతో నిబంధనల మేరకు వేలం పాట నిర్వహించాలని సూచించడంతో గత నెల 18, 19, 20వ తేదీల్లో 81 షాపులకు బహిరంగ వేలం నిర్వహించారు.

రికార్డు స్థాయిలో కార్పొరేషన్‌కు ఆదాయం..

25 సంవత్సరాల క్రితం షాపుల లీజులు కింద 81 షాపులకు లక్షల్లో ఆదాయం వస్తుంటే ప్రస్తుతం బహిరంగ వేలం నిర్వహించడం ద్వారా కార్పొరేషన్‌కు రూ.6.8 కోట్లు ఆదాయం సమకూరింది. వేలం పాటలో షాపులను దక్కించుకున్న వారికి ఏడు రోజుల్లో నాన్ రిఫండబుల్ ఫండ్ కట్టి షాపు తాళాలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. వేలం పాట జరిగి రోజులు గడుస్తున్నా పాత లీజుదారులు షాపులను ఖాళీ చేసేందుకు మొండికేశారు. శుక్రవారం షాపులకు స్వాధీనం చేసుకుని తాళాలు వేసేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై, డెప్యూటీ కమిషనర్లపై పాత లీజుదారులు అడ్డం తిరిగారు. షాపులకు తామకే కేటాయించాలని అడ్డం తిరిగడంతో చేసేదేమి లేక అధికారులు పోలీసులు సహకారంతో గత నెల 29 రాత్రి షాపులను స్వాధీనం చేసుకున్నారు. అయినా పాత లీజుదారులు షాపుల ముందే తిష్ట వేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న కమిషనర్ పులి శ్రీనివాసులు మార్కెట్ వద్ద బ్యారికేట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో సోమవారం మార్కెట్ బయట బ్యారికేట్స్ ఏర్పాటు చేశారు.

ప్రైవేట్ స్థలంలో మార్కెట్ పెట్టాలంటే కార్పొరేషన్ అనుమతి తప్పనిసరి


ప్రైవేట్ స్థలంలో మార్కెట్ ఏర్పాటు చేసుకోవాలంటే మున్సిపల్ చట్టాలకు అనుగుణంగా నగరపాలక సంస్థ అనుమతి తప్పనిసరి. దీంతో పాటు సదరు కాంప్లెక్స్‌కు గతంలో వీఎల్‌టీ ట్యాక్స్(ఖాళీ స్థల పన్ను) రూ.3 కోట్లకు పైగా ఉంది. ఆ తరువాత అక్కడ నిర్మాణం చేసుకున్నారు. తమకు సదరు నిర్మాణం చేసుకున్నామని వీఎల్‌టీ మాకు అప్లికబుల్ కాదంటూ సదరు కాంప్లెక్స్ నిర్వాహకులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు సదరు అంశంపై స్టే విధించింది. దీనికి అనుగుణంగా మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్(ఎంఎస్‌సీ) ద్వారా కౌంటర్ ఫైల్ కూడా వేయడం జరిగింది.

– చల్లా ఓబులేసు, అదనపు కమిషనర్

పరిశుభ్రమైన తాగునీరు అందించాలి

పెదకాకాని: రక్షిత మంచినీటి పథకం ద్వారా పెదకాకాని గ్రామంలో పరిశుభ్రమైన త్రాగునీరు అందించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. పెదకాకానిలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి రక్షిత మంచి నీటి స్టోరేజ్ ట్యాంకు కట్ట తెగడం, రెండు రోజులకు ఒకసారి త్రాగునీటి సరఫరాపై వివరించారు. ఈ సందర్భంగా సీపీఐ పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, కొల్లి రంగారెడ్డిలు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన పెదకాకాని లో కురిసిన భారీ వర్షానికి రక్షిత మంచినీటి పథకం వాటర్ స్టోరేజ్ ట్యాంకు కట్ట తెగి, పక్కనే ఉన్న మురుగు చెరువులోని నీరు వాటర్ స్టోరేజ్‌లో కలవటం వలన నీరు కలుషితమయ్యాయన్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి గ్రామంలో రోజు మార్చి రోజు ప్రజలకు నీటిని విడుదల చేస్తున్నారన్నారు. రెండు రోజులకు ఒకసారి వదిలే నీరు వదిలినప్పటికీ పలు ఇళ్ళకు చుక్క వాటర్ కూడా రాకపోవటం వలన పెదకాకాని లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఊరులోని బావులన్నీ వాడుకలో లేకపోవడం వలన పంచాయతీ వారు శుభ్రం చేసి బ్లీసింగు వేయకపోవడం వలన బావుల్లోని నీరు కలుషితమై వాడుకకు పనికిరాకుండా పోయాయన్నారు. గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, జగన్నాథం, విటల్‌రెడ్డి, సి.హెచ్. విజయలక్ష్మి, ఆర్ బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహానేత వైఎస్సార్ వర్ధంతి



వెనిగండ్ల పంచాయతీ కార్యాలయం వద్ద వెలుగులీనుతున్న రాజన్న విగ్రహం

పెదకాకాని: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని పెదకాకాని మండల పార్టీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి తెలిపారు. వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 11:30 గంటలకు పెదకాకాని సెంటర్‌లో ఉన్న దివంగత నేత మాజీ సీఎం డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం కొప్పురావూరు వయోవృద్ధుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పొన్నూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఈ వేడుకల్లో మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ముడియాల మల్లికార్జున రెడ్డి కోరారు.

పొన్నూరులో...

పొన్నూరు: ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కార్యాలయ వర్గాలు ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో ఉదయం 7.30 గంటలకు పొన్నూరు మండలంలోని మామిళ్లపల్లి గ్రామం, అనంతరం మునిపల్లె, పచ్చలతాడిపర్రు, పట్టణంలోని పార్టీ కార్యాలయం, అంబేద్కర్ సెంటర్, వెల్లలూరు, చేబ్రోలు మండలంలోని మంచాల, చేబ్రోలు, నారాకోడూరు, పెదకాకాని గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మహిళలకు సర్టిఫికెట్‌లు అందజేత



మహిళలకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న రమేష్‌బాబు

కాకుమాను: స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో గత కొద్ది నెలల నుంచి కుట్టు మిషన్‌లో శిక్షణ పొందుతున్న మహిళలకు సోమవారం సర్టిఫికెట్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విజ్ఞాన కేంద్ర ట్రస్టు కన్వీనర్ దొప్పలపూడి రమేష్‌బాబు మాట్లాడుతూ ఉత్తర అమెరి క తెలుగు సంఘం (నాట్స్) వారి సహకారంతో గత కొన్ని సంవత్సరాల నుంచి కుట్టు శిక్షణలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్‌లు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇతరులపై ఆధారపడకుండా స్వయం శక్తి, స్వయం ఉపాధి పొందాలనే లక్ష్యంతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి మహిళ ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని స్వయం ఉపాధి పొందాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏఎస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుర్రం వీర రాఘవయ్య, విజ్ఞాన కేంద్రం కో కన్వీనర్ కొత్త వెంకట శివరావు, జంపని రామారావు, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కాకుమాను ఎంఈవో కెన్నడీ



హెచ్‌ఎంకు కంప్యూటర్‌ను బహూకరిస్తున్న దాత పుట్లా ఆనందరావు

కాకుమాను (కొమ్మూరు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులు దాతలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కె.ఎఫ్ కెన్నడీ అన్నారు. మండలంలోని కొమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలని ఉద్దేశ్యంతో కాకుమాను గ్రామానికి చెందిన దాతలు రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ పుట్లా ఆనందరావు, తన సోదరుడు భాగ్యరాజుల తండ్రి పుట్లా డేవిడ్ 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం గుర్తించి దాతలు కంప్యూటర్‌ను బహూకరించడం అభినందనీయమన్నారు. పాఠశాలలోని విద్యార్థులు ప్రతిరోజు కొంత సమయాన్ని కంప్యూటర్ పై కేంద్రీకరించి కంప్యూటర్ మెలకువలు నేర్చుకోవాలని ఆయన సూచించారు. మరో దాత డ్రైగార్డ్ డిజైన్ అధినేత మాధవి మరో కంప్యూటర్‌ను పాఠశాలకు బహూకరించారు. దాతలను ఎంఈవో కెన్నడీ, ఉపాధ్యాయులు శాలువ, పూలమాలలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర రంగారావు, మండల లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, దాతలు పాల్గొన్నారు.

నగరంలో ఈ–టాయిలెట్స్ ఏర్పాటు



ఈ-టాయిలెట్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ అలీమ్ బాషా తదితరులు

మంగళగిరి టౌన్: నగర పరిధిలోని గౌతమబుద్ధ రోడ్, కాళీమాత ఆలయం వద్ద ప్రజల సౌకర్యార్థం ఈ-టాయిలెట్స్‌ను ఏర్పాటు చేసినట్లు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. సెల్‌కాన్, సీఎస్ఆర్ నిధులతో ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ లూకేస్ ఏర్పాటు చేసిన ఈ-టాయిలెట్స్‌ను సోమవారం టీడీపీ నేతలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్రంలోనే మొట్టమొదటి ఈ-టాయిలెట్స్‌ను మంగళగిరిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పురుషులు, మహిళలతో పాటు దివ్యాంగులు సైతం వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఆర్టీసీ బస్టాండ్, పెట్రోల్ బంక్, నులకపేట అన్న క్యాంటీన్ వద్ద కూడా వీటిని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ-టాయిలెట్ ఎదుట కాఫీ షాప్, క్లాత్, జ్యూట్ బ్యాగ్స్, మొక్కజొన్నతో తయారు చేసిన డిస్పోజబుల్ గ్లాసెస్, క్యారీ బ్యాగ్‌లను విక్రయించే స్టాల్‌ను పర్మినెంట్‌గా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, తమ్మిశెట్టి జానకీ దేవి, ఆరుద్ర భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు సమగ్ర పరిష్కారం చూపాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు విభాగాధిపతులతో పాటు క్షేత్ర స్థాయి అధికారులు కూడా హాజరు కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 32 ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం కౌన్సిల్‌లో సమావేశంలో పీజీఆర్ఎస్ ద్వారా అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్(ఇన్‌చార్జి) రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

వేగంగా తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలి

నగరంలోని నెహ్రూ నగర్ పంప్ హౌస్, సంజీవయ్య నగర్ రైల్వే గేటు దగ్గర చేపట్టిన తాగునీటి పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, వేగంగా తాగునీటి సరఫరాని పునరుద్ధరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నెహ్రూ నగర్, సంజీవయ్య నగర్ దగ్గర జరుగుతున్న పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను ప్రారంభించామని, ఇంటర్ కనెక్షన్ పూర్తయితే నగరంలో తాగునీటి సరఫరాలో మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు.

చెరుకు రసం మెషీన్‌ను అమ్మేసుకున్నారు..

నెహ్రూనగర్: కొత్తపేట నుంచి నెహ్రూనగర్ వెళ్లే రోడ్డు పక్కన చెరుకు రసం అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న ఓ వృద్ధురాలి చెరుకు రసం మెషీన్‌ను నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది రోడ్డు ఆక్రమణల పేరుతో తీసుకువెళ్లి సదరు మెషీన్‌ను అమ్మేసుకుని తనకు పాత మెషీన్‌ను ఇచ్చి తీసుకెళ్లమంటున్నారని వసంతరాయపురానికి చెందిన సుబ్బలక్ష్మమ్మ అనే వృద్ధురాలు నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు ఫిర్యాదు చేసింది.

నూతన రైస్ కార్డులు అందరికీ అందాలి

కాకుమాను తహసీల్దార్ వెంకట స్వామి

కాకుమాను: నూతన స్మార్ట్ రైస్ కార్డులు అర్హులైన ప్రతి కుటుంబం పొందాలని తహసీల్దార్ వెంకట స్వామి స్పష్టం చేశారు. మండల కేంద్రమైన కాకుమాను షాపు నెం 2 నందు సోమవారం స్మార్ట్ కార్డుల పంపిణీ చేశారు. ఈ నెల వరకు ఈ స్మార్ట్ కార్డులు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. మండలంలో మొత్తం 31షాపులకు గాను 13,617 మందికి స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి రోడ్డు విస్తరణ ప్రతిపాదన ఆపాలంటూ వినతి



మంగళగిరి టౌన్ : నగర పరిధిలోని తెనాలి రోడ్డు విస్తరణ ప్రతిపాదనను నిలిపివేయాలని తెనాలిరోడ్డు వాసులు, హ్యాండ్‌లూమ్ వ్యాపారులు, చిరు వ్యాపారులు సోమవారం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ సంక్షోభం వల్ల దశాబ్ద కాలంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇప్పుడిప్పుడే వ్యాపారాలు మెరుగుపడుతున్నాయని, ఇలాంటి సమయంలో రోడ్డు విస్తరణ చేస్తే షాపులు కోల్పోయి వ్యాపారస్తులు రోడ్డున పడే అవకాశముందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న 90 శాతం కంటే ఎక్కువ మంది రోడ్డు విస్తరణకు ఇవ్వలేమని లిఖిత పూర్వకంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. తెనాలి రోడ్డులో పలు ఆలయాలు, మత పరమైన స్థలాలు, ఖబరిస్థాన్ దెబ్బతినే ప్రమాదముందని అన్నారు. అహ్మదాబాద్, జైపూర్, మైసూర్, హైదరాబాద్‌ల మాదిరిగా తెనాలి రోడ్డును వాకింగ్ స్ట్రీట్‌గా అభివృద్ధి చేస్తే చేనేతలకు చేయూతనిచ్చినట్లేనని తెలిపారు.

వేజండ్లలో వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు



వేజండ్లలో పూజలు చేస్తున్న అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: మండలం వేజండ్లలో వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సోమవారం పాల్గొన్నారు. స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో బాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అంబటి మురళీకృష్ణ వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ కమిటీ సభ్యులు అంబటిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి, నాయకులు పగిడి వెంకటేశ్వరరావు, కె. ముత్యమేశ్వర రావు, జువ్వా వీరాస్వామి, బొద్దూరి భాస్కరరెడ్డి, ఎం.వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, పండు పాల్గొన్నారు.

సుద్దపల్లిలో విస్తృత బందోబస్తు

చేబ్రోలు: మండలం సుద్దపల్లి గ్రామంలో నాలుగు రోజుల క్రితం వినాయక విగ్రహ నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో గ్రామంలో పోలీసులు విస్తృత పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలోని ప్రధాన మార్గాల్లో అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ పి.వీరనారాయణలు గ్రామంలో పరిస్థితిని పర్యవేక్షించారు.

ఇరువురిపై కేసు నమోదు

చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఉద్దేశ పూర్వకంగా కొట్టడంపై ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. సుద్దపల్లి గ్రామానికి చెందిన గుంజి పోతురాజు, వెంకటేష్‌లు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ముందు ఉన్న స్నేహితుడిని హాయ్ చెప్పే ప్రయత్నంలో పక్కనున్న తోట నాగేశ్వరావు తలకు చేయి తగిలింది. ప్రస్తుతం గ్రామంలో రెండు వర్గాల మధ్య మనస్పర్థల కారణంగా వివాదాలు జరుగుతున్నాయి. పోతురాజు ఇంటికి వెళ్లి జరిగిన సంఘటనపై వివరణ కోరగా వివాదం జరిగింది. తోట నాగేశ్వరావు ఫిర్యాదు మేరకు గుంజి పోతురాజు, వెంకటేష్‌లపై ఎస్ఐ పి.వీరనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఈఈలకు బాధ్యతలు అప్పగింత

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు ఇటీవల బదిలీపై వచ్చిన ఈఈలకు(ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు) బాధ్యతలు అప్పగిస్తూ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈఈ 3 వేణుకి 18, 19, 29, 22 వార్డులతో పాటు ప్రాజెక్ట్స్, ఏపీఎండీపీ 1,2, అమృత్ 1,2.0, పీవీకే నాయుడు, ఇతర ప్రాజెక్ట్స్ వర్కులు కేటాయించారు. ఈఈ- 4 ఎస్.విష్ణుమూర్తికి వెహికల్ షెడ్, సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్, స్లాటర్ హౌస్‌తో పాటు 11, 13,14,15,17, 27, 28 వార్డులు, ఎస్‌టీపీ, ఎఫ్ఎస్‌టీపీ, ప్లాంటేషన్ కార్యక్రమాలకు సంబంధించిన విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందివ్వాలి

నెహ్రూనగర్: నగర ప్రజలకు రక్షిత, స్వచ్ఛమైన తాగునీరు అందించడం లేదని నగర కార్పొరేషన్ పరిధిలో 62 ఓవర్ హెడ్ ట్యాంక్స్ ఉన్న వాటిలో కొన్ని ట్యాంకులకుపై కప్పులు పూర్తిగా లేవని, మరి కొన్ని ట్యాంకులు నిరంతరం కడగటానికి వీలుపడక మురికి పేరుకు పోయిందని గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.